సత్తాచాటిన మిథుల్ శ్రీవత్స


మిథుల్ శ్రీవత్స

ముషీరాబాద్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) నిర్వహిస్తున్న సి–డివిజన్ వన్‌డే లీగ్ మ్యాచ్‌లలో భాగంగా సికింద్రాబాద్ జింకాన ప్లే గ్రౌండ్స్‌లో బుధవారం ఆర్‌జేసీసీ, అంబర్‌పేట్ జట్ల మధ్య 35 ఓవర్ల క్రికెట్ మ్యాచ్ జరిగింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన ఆర్‌జేసీసీ జట్టు 8 వికెట్ల నష్టానికి 171 పరుగులు చేసింది. తరువాత బ్యాటింగ్‌కు దిగిన అంబర్‌పేట్ జట్టు 98 పరుగులకే ఆల్ అవుట్ అయింది. ఆర్‌జేసీసీ జట్టు కెప్టెన్, రాంనగర్ కుర్రోడు మిథుల్ శ్రీవత్స కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడి 89 బాల్స్‌లో 92 పరుగులు చేశాడు. మైదానం నలువైపుల కళ్లు చెదిరే 11 ఫోర్లు కొట్టి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు.

అభివృద్ధి పనులే గెలిపిస్తాయి

- సమస్యలన్నీ పరిష్కరించా
- నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దా
- ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్



భోలక్‌పూర్‌లో ముస్లింలకు కండవా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: గడచిన ఐదేళ్లల్లో ముషీరాబాద్ నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి పనులే తనను రెండవసారి ఎమ్మెల్యేగా గెలిపిస్తాయని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. ప్రజల ఆశీర్వాదం బీఆర్‌ఎస్‌కే ఉందని ఆయన స్పష్టం చేశారు. బుధవారం భోలక్‌పూర్‌లో డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు, మైనార్టీ కమిటీ విభాగం రాష్ట్ర నాయకుడు రహీం సంయుక్త ఆధ్వర్యంలో వివిధ పార్టీలకు చెందిన మహబూబ్‌అలీ, మహ్మద్ నజీర్, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి ఎమ్మెల్యే ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... శేఖర్‌రెడ్డి వీధిలో నెలకొన్న డ్రైనేజీ సమస్యను రూ. 15 లక్షతో శాశ్వతంగా పరిష్కరించామన్నారు. నియోజకవర్గంలో గతంలో ఏ పాలకులు చేయని విధంగా అభివృద్ధి చేసి ప్రజా సమస్యలను పరిష్కరించామన్నారు. మరోసారి ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామన్నారు. అన్ని వర్గాల ప్రజలకు సీఎం కేసీఆర్ అందిస్తున్న సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందేలా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ యువ నాయకులు ముఠా జైసింహ, బీఆర్‌ఎస్ నాయకులు రెబ్బరామారావు, ఎస్.కె.షకీల్, యూసుఫ్, అజీజ్‌భాయ్, అబుబాకర్, నసీరుద్దీన్, మహ్మద్ ఆశీం, తాజిత్, జునేద్‌బాగ్దాదీ, మున్వర్‌చాంద చాంద్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

ముషీరాబాద్ డివిజన్‌లో...

ముషీరాబాద్ డివిజన్‌లోని ప్రేయర్‌పవర్ చర్చి వీధిలో సంధ్యారాణి ఆధ్వర్యంలో 50 మంది యువకులు ఎమ్మెల్యే ముఠా గోపాల్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. బీఆర్‌ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ, గ్రేటర్ సీనియర్ నాయకులు టి.సోమన్, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు నర్సింగ్‌ప్రసాద్, ఆకుల అరుణ్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్‌రెడ్డి, నాయకులు దీన్‌దయాల్‌రెడ్డి, ఎయిర్‌టెల్ రాజు తదితరులు పాల్గొన్నారు.

అంబర్‌పేటలో బీజేపీ విజయం ఖాయం


మాట్లాడుతున్న కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్

కాచిగూడ: అంబర్‌పేట నియోజకవర్గంలో బీజేపీ విజయం ఖాయమని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ అన్నారు. అసెంబ్లీ ఎన్నికల అనంతరం తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడితే బీసీ ముఖ్యమంత్రి అవుతారని ప్రకటించిన ప్రధాని నరేంద్రమోదీకి ధన్యవాదాలు తెలియజేస్తూ బుధవారం పార్టీ నేతలు, కార్యకర్తలు నారాయణగూడలో పాదయాత్ర నిర్వహిస్తూ ఇంటింటికి ప్రచారం చేపట్టారు. నేతలు ఎ.సూర్యప్రకాష్ సింగ్, సుభాష్ పటేల్, సి.వినోద్ యాదవ్, బి.భీమ్‌రాజ్, శీర్‌సాగర్, ఎస్.రవియాదవ్, మల్లికార్జున్, హజారిబాబు, ఎం.నర్సింగ్‌రావు, ఆరవింద్, బల్వీర్, ఆర్.సంతోష్, లావణ్య, శాంతాబాయి, వరలక్ష్మీ, సారిక పాల్గొన్నారు.

ఐదేళ్లలో ఎంతో అభివృద్ధి చేశా: ముఠా గోపాల్


గాంధీనగర్‌లో ఎమ్మెల్యే ముఠాగోపాల్, జైసింహాలను గజమాలతో సన్మానిస్తున్న దృశ్యం

చిక్కడపల్లి: గడచిన ఐదు సంవత్సరాల్లో ముషీరాబాద్ నియోజవర్గాన్ని కోట్లాది రూపాయలతో అభివృద్ధితో పాటు ప్రజలకు సంక్షేమ పథకాలు అందించామని బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. బుధవారం గాంధీనగర్ డివిజన్‌లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. బాపూనగర్‌లోని శ్రీ రాజరాజేశ్వరి ఆలయంలో ముఠాగోపాల్, యువజన నాయకుడు ముఠా జైసింహ, ఇతర నాయకులతో కలసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీఆర్‌ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు ఎం.రాకేశ్‌కుమార్, మాజీ కార్పొరేటర్లు ముఠా పద్మ, మాటర్ల పద్మ, ముఠానేరేశ్, బీఎన్ శ్రీనివాస్‌యాదవ్, ఎర్రం శ్రీనివాస్‌యాదవ్, ఎర్రం శ్రీనివాస్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవలో భాగస్వాములు కావాలి


మాట్లాడుతున్న జస్టిస్ చంద్రకుమార్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అందులో భాగంగా లయన్ విజయ్‌కుమార్ చేస్తున్న సేవలు అందరికి ఆదర్శనీయమని హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ అన్నారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలోని ఆరిగపూడి పూర్ణచందర్‌రావు ఫౌండేషన్, విమల సాహితి సమితి ఆధ్వర్యంలో కవి సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా పలువురు కవులు సాహిత్యానికి సంబంధించిన కవితలను చదివి వినిపించారు. అనంతరం జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ... ఎన్ని కోట్లు సంపాదించిన, ఎన్ని పదవులు నిర్వహించిన చివరకు ఏది తమ వెంట రాదని, సమాజ సేవయే చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. లయన్ డాక్టర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ... సమాజ హితం కోసం తమ ఫౌండేషన్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. కళా రత్న డాక్టర్ బిక్కి కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి డాక్టర్ విద్యాదర్‌రావు, రచయిత పాతూరి మల్లేష్, స్వామి, అపర్ణ, వరలక్ష్మి పాల్గొన్నారు.

ఫీవర్ ఆస్పత్రిని సందర్శించిన డీఎంహెచ్‌వో



నల్లకుంట: ఖైరతాబాద్ డీఎంహెచ్ంవో డాక్టర్ పుట్ట శ్రీనివాస్ బుధవారం నల్లకుంట ఫవర్ ఆస్పత్రిని ఆకస్మికంగా సందర్శించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. శంకర్, ఆర్ఎంవో డాక్టర్ జయలక్ష్మితో కలిసి ముందుగా ఓపీ బ్లాక్‌ను సందర్శించిన పుట్ట శ్రీనివాస్ అక్కడ రోగులకు జారీ చేస్తున్న ఓపీ చీటీల ప్రక్రియ, ఓపీ రోగులకు అందుతున్న వైద్య సదుపాయలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇన్ పేషెంట్స్ వార్డులను సందర్శించి అక్కడ చికిత్సలు పొందుతున్న రోగులను స్వయంగా పరీక్షించిన ఆయన రోగులకు అందిస్తున్న భోజనం, వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. రోగులకు అందిస్తున్న భోజనం నాణ్యత, వైద్య సేవలపై పుట్ట శ్రీనివాస్ సంతృప్తిని వ్యక్తం చేశారు. డిప్యూటీ ఆర్ఎంవో డాక్టర్ చంద్ర శేఖర్ రెడ్డి, ఫార్మసిస్ట్ జాలిగామ అశోఖ్ తదితరులు పాల్గొన్నారు.

అపురూపకావ్యం ఏకవీర


ప్రొఫెసర్ శ్రీదేవి, ఉషాలను సన్మానిస్తున్న దృశ్యం

చిక్కడపల్లి: తెలుగు సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించే అపురూప కావ్యం ఏకవీర అని ప్రముఖ సరస్వతీ ఉపాసకులు దైవజ్ఞశర్మ అన్నారు. వీణాపాణి కళానిలయం ఆధ్వర్యంలో తెలుగు భాషా సాహితీ వినీలాకాశంలో దేదీప్యమానంగా వెలుగుతున్న కవిశ్రేష్ఠులలో అగ్రగణ్యులు, ప్రప్రథమ జ్ఞానపీఠ పురస్కార గ్రహీత కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ రచించిన ఏకవీర నవలా చిత్రం దృశ్య కావ్య ప్రదర్శన త్యాగరాయ గానసభలో బుధవారం జరిగింది. ప్రదర్శనలో సేతుపతి, ఏకవీర పాత్రలను సమర్థవంతంగా పోషించిన ప్రొఫెసర్ శ్రీదేవి, ఉషాలను సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ఏకవీర చిత్రాన్ని మహోన్నతమైన చిత్రంగా మలిచిన వారు గొప్ప సినీ దర్శకులు సి.ఎస్.రావు అన్నారు. ప్రాధాన్యత సంతరించుకున్న ఈ చిత్రంలోని అనేక ముఖ్య ఘట్టాలను అపురూపమైన దృశ్య కావ్యంగా ప్రదర్శించారు. కార్యక్రమంలో సైకాలజిస్ట్ జె.కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

కొల్లూరి వెంకటేష్‌కు డాక్టరేట్.. సన్మానం


వెంకటేష్‌ను సన్మానిస్తున్న దృశ్యం

ముషీరాబాద్: ఉస్మానియా యూనివర్సిటీలో పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో డాక్టరేట్ పొందిన ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కొల్లూరి వెంకటేష్‌ను బుధవారం ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మేడి పాపన్న, రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్‌లు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ... తనకు సహకరించిన విద్యార్థి నాయకులకు, ఎమ్మార్పీఎస్ నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో పి.రమేష్, వి.చందు, జీవన్, శ్యామ్‌రావు, గంగాపురం రాములు, ఉప్పలయ్య, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ ఫెస్టివల్ విజేతలకు బహుమతుల ప్రదానం


బహుమతులను ప్రదానం చేస్తున్న డాక్టర్ ధర్మరాజు

కాచిగూడ: వైఎంసీఏ గ్రేటర్ హైదరాబాద్ నారాయణగూడ బ్రాంచి ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించిన 23వ వార్షిక వైఎంసీఏ కార్గిల్ విక్టరీ స్పోర్ట్స్ ఫెస్టివల్ – 2023లో విజేతలైన క్రీడాకులకు వైఎంసీఏ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు డాక్టర్ జోనాథన్ ధర్మరాజు బహుమతులను ప్రదానం చేశారు. బుధవారం నారాయణగూడ వైఎంసీఏ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో విద్యార్థులకు టేబుల్ టెన్నిస్, ఖో ఖో, కబడ్డీ, బాక్స్ క్రికెట్, బాస్కెట్ బాల్, త్రో బాల్, కరాటే, చెస్ వంటి క్రీడాంశాల్లో పోటీలను నిర్వహించారు. విద్యార్థుల నుంచి మంచి స్పందన లభించిందని నిర్వహకులు తెలిపారు. వైఎంసీఏ గ్రేటర్ హైదరాబాద్ జనరల్ సెక్రెటరీ ప్రిస్టీలీ గైస్, బి.జె.వినయస్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

గడలపై ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలి

కాచిగూడ: బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలా వ్యవహరిస్తూ ఎన్నికల కోడ్ వచ్చిన తర్వాత డిప్యూటేషన్లు ఇస్తున్న తెలంగాణ రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాస్‌రావుపై కేంద్ర ఎన్నికల కమిషనర్ తగు చర్యలు తీసుకోవాలని జాతీయ వెనుకబడిన తరగతులు (బీసీ) మహిళా సంఘం అధ్యక్షురాలు ఎస్.కె.ప్రసన్న కోరారు. ఈ విషయమై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ వికాస్ రాజ్‌కు ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గడల శ్రీనివాస్ రావును వెంటనే పదవి నుంచి తొలగించాలని ఆమె కోరారు.

బీఆర్‌ఎస్ పాలనలో అభివృద్ధి శూన్యం

కాంగ్రెస్ అభ్యర్థి అంజన్‌కుమార్‌యాదవ్


కాంగ్రెస్‌లో చేరిన బీజేపీ కార్యకర్తలు

ముషీరాబాద్: పార్లమెంట్ సభ్యుడుగా పదేళ్ల ముషీరాబాద్ నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధి తప్ప కొత్తగా బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ హయాంలో చేసింది ఏమీ లేదని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎం.అంజన్‌కుమార్‌యాదవ్ ఆరోపించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అవినీతి తప్ప అభివృద్ధి ఎక్కడ కనపడడం లేదన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం అడిక్‌మెట్ డివిజన్‌లోని శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయంలో పూజలు చేసి ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డివిజన్‌లోని కట్టంబాయి బస్తీ, లలితానగర్, వడ్డెర బస్తీ, అంబేద్కర్‌నగర్, రాంనగర్ గూండు, విద్యానగర్ తదితర ప్రాంతాల్లో ఇంటింటికీవెళ్లి కాంగ్రెస్ పార్టీ హామీల కరపత్రాలను వివరించారు. పార్టీ డివిజన్ అధ్యక్షుడు తిరుమల్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు ఆర్.కల్పనాయాదవ్, వాజిద్ హుస్సేన్, నాయకులు విజయకుమార్, డాక్టర్ అన్సారీ, రామకృష్ణ, గోపాల్, డాక్టర్ శ్రీధర్, వరద రాజు, బి.ఎస్.మధు తదదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీజేపీ కార్యకర్తలు...

అడిక్‌మెట్ డివిజన్‌లోని రాంనగర్ చౌరస్తాలోని మణెమ్మ గల్లీకి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు లడ్డూయాదవ్ ఆధ్వర్యంలో 50 మంది కార్యకర్తలు ముషీరాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అంజన్‌కుమార్‌యాదవ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. అంజన్‌కుమార్ యాదవ్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

బీజేపీ నేతల ఇంటింటి ప్రచారం


పాదయాత్ర చేస్తున్న బీజేపీ నాయకులు

కవాడిగూడ: తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే బీసీ సామాజిక వర్గంకు చెందిన వ్యక్తిని సీఎంగా చేస్తామని ప్రకటించిన నేపథ్యంలో దేశ ప్రధాని నరేంద్రమోదీ, జేపీ నడ్డాలకు కృతజ్ఞతగా తెలంగాణ ప్రజలు బీజేపీని గెలిపించి అధికారంలోకి తీసుకురావాలని కవాడిగూడ కార్పొరేటర్ జి.రచనశ్రీ పిలుపునిచ్చారు. బుధవారం కవాడిగూడ డివిజన్‌లోని కొత్తబజార్ సంకటవిమోచన హనుమాన్ ఆలయం నుంచి కవాడిగూడ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు ఎం.సి మహేందర్‌బాబు ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పాదయాత్రకు కార్పొరేటర్ రచనశ్రీ, బీజేపీ ఓబీసీ మోర్చా నగర అధ్యక్షుడు సలంద్రి శ్రీనివాస్‌యాదవ్, ముషీరాబాద్ నియోజకవర్గ కన్వీనర్ ఎం.రమేష్‌రాం హాజరయ్యారు. హనుమాన్‌దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పాదయాత్రను డివిజన్ పరిధిలోని కొత్తబజార్, మసీద్ గల్లీ, కుమ్మరిబస్తీ, ముగ్గుబస్తీ, సింగాడికుంటా నుంచి లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని శివాలయం వరకు నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర నాయకులు జి.వెంకటేష్, పరిమళ్‌కుమార్, రంగరాజ్‌గౌడ్, బీజేపీ డివిజన్ ప్రధాన కార్యదర్శులు ఎ.ప్రభాకర్, కేశవరాజు, నాయకులు సురేష్ ముదిరాజ్, పీఎస్ చారి, భువనగిరి చంద్రశేఖర్, మీసాల విఠల్‌రావు, గంటా శ్రీనివాస్, సలంద్రి దిలీప్‌యాదవ్, రమేష్, పరుశురాం, లింగంగౌడ్, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సంఘం మద్దతు కోరిన కాంగ్రెస్ అభ్యర్థి


కాంగ్రెస్ అభ్యర్థి రోహిణ్‌రెడ్డిని సత్కరిస్తున్న బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు

అంబర్‌పేట: ఎన్నికల్లో తమకు అండగా ఉండాలని అంబర్‌పేట నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి సి.రోహిన్‌రెడ్డి బ్రాహ్మణ సంఘం ప్రతినిధులను కోరారు. బుధవారం డీడీ కాలనీలో ఆయన బ్రాహ్మణ సంఘం ప్రతినిధులతో కలిసి ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. తనకు ఒక అవకాశం ఇచ్చి ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు నర్సింగ్‌రావు, కె.ఎస్.ఎన్.మూర్తి, కేవీ సుబ్బారావు, కె.విశ్వనాథ్ తదితరులు ఉన్నారు.

నల్లకుంటలో బీజేపీ భారీ ర్యాలీ


ర్యాలీలో పాల్గొన్న డాక్టర్ గౌతం రావు, కార్పొరేటర్ అమృత

నల్లకుంట: చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు 33 శాతానికి పెంచడంతో పాటు తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే బీసీని ముఖ్యమంత్రిగా చేస్తామని ప్రధాని నరేంద్రమోదీ ప్రకటించిన నేపథ్యంలో బుధవారం నల్లకుంటలో బీజేపీ ఆధ్వర్యంలో మోదీకి ధన్యవాదాలు తెలుపుతూ భారీ ర్యాలీ చేపట్టారు. ఫీవర్ ఆస్పత్రి చౌరస్తా వద్ద ప్రారంభమైన ర్యాలీ తిలక్‌నగర్, గోల్నాక మార్కెట్, భాగ్యనగర్ బస్తీ, వెంకటేశ్వర నగర్, కార్ఖాన గల్లీ తదితర ప్రాంతాల మీదుగా సాగింది. ర్యాలీలో బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు, కార్పొరేటర్ వై.అమృత, పార్టీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు వనం రమేష్, నియోజకవర్గం కన్వీనర్ శ్యామ్‌రాజ్, డివిజన్ అధ్యక్షుడు బి.సురేష్ యాదవ్, నేతలు పాతకోటి మహేష్, ఎస్.రామ్‌జగదీష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అట్టడుగు వర్గాల అభ్యున్నతికి బీఆర్‌ఎస్ కృషి

అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట్: తెలంగాణలో అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం పాటుపడిందని అంబర్‌పేట ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి కాలేరు వెంకటేష్ తెలిపారు. బుధవారం అంబర్‌పేట ఆలీకేఫ్ ప్రాంతంలో అంబర్‌పేట నియోజకవర్గం టూవీలర్ మెకానిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఆత్మీయ సమ్మేళనానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. అన్ని వృత్తుల వారికి సీఎం కేసీఆర్ ప్రభుత్వం ప్రత్యక్షంగా, పరోక్షంగా లబ్ధి చేకూర్చిందని తెలిపారు. ఎన్నికల్లో తిరిగి బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గెలిపించాలని ఆయన కోరారు. నియోజకవర్గంలో బడుగు బలహీన వర్గాలకు ప్రభుత్వంతో పాటు తనవంతు అండగా ఉంటానన్నారు. కార్పొరేటర్ విజయకుమార్‌గౌడ్, అసోసియేషన్ అధ్యక్షుడు జి.అశోక్‌కుమార్, ప్రతినిధులు మల్లేశ్, మహేందర్‌చారి, ప్రతాప్‌చారి, బీఆర్‌ఎస్ నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య



కాచిగూడ: రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ వి.ఎల్.చారి సమాచారం మేరకు... విద్యానగర్–కాచిగూడ రైల్వే స్టేషన్ల మధ్య గుర్తుతెలియని వ్యక్తి(35) రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి ఒంటిపై బ్లాక్ షర్టు, బ్లూ కలర్ జీన్ ఫ్యాంట్ ఉంది. వివరాలకు సెల్: 87126 58584, 87125 68429లో సంప్రదించాలని సూచించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యమకారులకు అన్యాయం

చిక్కడపల్లి: తెలంగాణ సాధన కోసం శ్రమించిన ఉద్యమకారులకు బీజేపీలోనూ న్యాయం జరగడం లేదని ప్రపుల్‌రాంరెడ్డి అన్నారు. అందుకే బీజేపీకి రాజీనామా చేస్తున్నట్లు ఆయన వివరించారు. బుధవారం చిక్కడపల్లిలోని తన కార్యాలయంలో ప్రపుల్‌రాంరెడ్డి మాట్లాడుతూ... బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి తన రాజీనామా లేఖను సమర్పించినట్లు వివరంచారు. తెలంగాణ ఉద్యమంలో ఉవ్వెత్తున ఎగసిపడేలా పనిచేసిన తాను టీఆర్‌ఎస్ వ్యవస్థాపక సభ్యుడినని తెలిపారు. టీఆర్‌ఎస్‌లో ఉద్యమకారులకు న్యాయం జరగడంలేదని గ్రహించి అధికారంలో ఉన్నప్పటికి ఆ పార్టీకి రాజీనామా చేసానని తెలిపారు. గత కార్పొరేటర్ ఎన్నికలకు ముందు మూడేళ్ల కిందట బీజేపీలో చేరానని ముషీరాబాద్ నియోజవర్గంలో బీజేపీ కార్పొరేటర్ల గెలుపులో ఎంతో కృషి చేసినట్లు ప్రపుల్ రాంరెడ్డి వివరించారు. ఉద్యమకారులకు బీజేపీలోనూ సరైన ప్రాతినిధ్యం లభించడం లేదని తెలుసుకుని బీజేపీకి రాజీనామా చేశానన్నారు. రెండు మూడు రోజుల్లో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు.

ఆంజనేయ స్వామి ఆలయ హుండీ లెక్కింపు

చిక్కడపల్లి: వివేక్‌నగర్‌లోని ప్రసిద్ధి చెందిన శ్రీ అంజనేయ స్వామి ఆలయంలోని హుండీని దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ బి.సురేఖ పర్యవేక్షణలో బుధవారం లెక్కించారు. గడచిన నెలలో జుల్లో హుండీ ద్వారా భక్తులు సమర్పించిన కానుకలు రూ.1,45,588లు వచ్చాయని ఆలయ ఈవో మాచార్ల దేవనాథం తెలిపారు. ఆలయ చైర్మన్ బాసాని పద్మసూర్యప్రకాశ్, ఆలయ పునఃనిర్మాణ కమిటీ సభ్యులు డాక్టర్ టి.రామకృష్ణ, డాక్టర్ జి.కె.రమణ, మురికిగణేష్, , కె.కృష్ణమూర్తి, బుగ్గా లక్ష్మీపతిశర్మ, కందాల వెంకటాద్రి, ఎస్.బి.వి.ఎన్.ఆచార్యులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరాలని కేశవ్‌కు ఆహ్వానం


కేశవ్‌తో భేటీ అయిన ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: కాంగ్రెస్ పార్టీపై అసంతృప్తిగా ఉన్న టీపీసీసీ మాజీ కార్యదర్శి జి.ఎస్.కేశవ్, అడిక్‌మెట్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు నాగేంద్రప్రసాద్‌తో పాటు పలువురు నేతలతో బీఆర్‌ఎస్ ముషీరాబాద్ నియోజకవర్గం అభ్యర్థి, ఎమ్మెల్యే ముఠా గోపాల్ భేటీ అయి బీఆర్‌ఎస్‌లో చేరాలని చర్చలు జరిపారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ల సేవలను విస్మరించిందని గోపాల్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, పేదల సంక్షేమం కోసం పని చేస్తున్న కేసీఆర్ నాయకత్వాన్ని, నియోజకవర్గంలో తనపనితీరు చూసి తన అనుచరులతో బీఆర్‌ఎస్‌లోకి రావాలని కేశవ్‌కు సూచించారు. అందుకు కేశవ్ మాట్లాడుతూ... తన అనుచరులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని గోపాల్‌కు హామీ ఇచ్చారు. బీఆర్‌ఎస్ యువజన నాయకుడు ముఠా జైసింహ, అడిక్‌మెట్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్ష, కార్యదర్శులు బల్లా శ్రీనివాస్‌రెడ్డి, కె.సురేందర్, నాయకులు డి.రవియాదవ్, ఖదీం, జెల్ల భిక్షపతి, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

సుందరయ్య పార్కు వద్ద ఎస్ఎఫ్ఐ నిరసన

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ కొనసాగిస్తున్న దాడులను ఆపాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం సుందరయ్య పార్కు వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు మాట్లాడుతూ... పాలస్తీనాలో శాంతిని నెలకొల్పడానికి ప్రపంచ దేశాలు ముందుకు రావాలన్నారు. భారత ప్రభుత్వం పాలస్తీనాకు అండగా నిలవాలని కోరారు. ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అశోక్‌రెడ్డి, లెనిన్, నాగేందర్, అజయ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.



బీజేపీకి అధికారం ఖాయం


ముషీరాబాద్‌లో పాదయాత్ర చేస్తున్న కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్

ముషీరాబాద్: ప్రధాని నరేంద్రమోదీ చేపడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ప్రజలు బీజేపీ పాలనను కోరుకుంటున్నారని ముషీరాబాద్ కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్ అన్నారు. రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ఆమె ధీమా వ్యక్తం చేశారు. బుధవారం ముషీరాబాద్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు బద్రినారాయణ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి బీసీ వర్గానికి చెందిన వారినే చేస్తామని ప్రధాని నరేంద్రమోదీ ప్రకటించడంతో హర్షం వ్యక్తం చేస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ బాపూజీనగర్, గంగపుత్ర కాలనీ, అంబేద్కర్‌నగర్, ఎంసిహెచ్ కాలనీ, కళాధర్‌నగర్ వరకు నిర్వహించారు. నియోజకవర్గం బీజేపీ జాయింట్ కన్వీనర్ ఎం.నవీన్‌గౌడ్, ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు పూస రాజు, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జమాల్‌పురి నందు, డివిజన్ ప్రధాన కార్యదర్శి కంచి కుమార్, నాయకులు అజయ్, ఆనంద్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

హత్యా రాజకీయాలతో అధికారంలోకి రాలేరు

- బీఆర్‌ఎస్ ఎన్నికల ఇన్‌చార్జీ ప్రభాకర్


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ప్రభాకర్

ముషీరాబాద్: రాబోయే ఎన్నికల్లో విజయం సాధించాలనే తపనతో కాంగ్రెస్ హత్యా రాజకీయాలకు పాల్పడుతుందని ఎమ్మెల్సీ, ముషీరాబాద్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ ఎన్నికల ఇన్‌చార్జీ, ఎమ్మెల్సీ ఎం.ఎస్.ప్రభాకర్ ఆరోపించారు. బుధవారం ముషీరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... దాడులు, హత్యాయత్నాలకు పాల్పడుతూ భయాందోళనలు సృష్టిస్తున్న కాంగ్రెస్ నేతలకు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిపై కాంగ్రెస్ నాయకులు దాడి చేయడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. వై.శ్రీనివాస్‌రావు, శంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతలకు బుజ్జగింపులు


కాంగ్రెస్ సీనియర్ నేత నల్లవెల్లి అంజిరెడ్డిని కలిసిన అనిల్‌కుమార్‌యాదవ్

ముషీరాబాద్: కాంగ్రెస్ పార్టీ టికెట్ ఆశించి భంగపడ్డ అసంతృప్త నేతలను సికింద్రాబాద్ డీసీసీ అధ్యక్షుడు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్ బుజ్జగించే ప్రయత్నం చేశారు. ముషీరాబాద్ కాంగ్రెస్ టికెట్‌ను ఎం.అంజన్‌కుమార్ యాదవ్‌కు కేటాయించినా వారు ప్రచార కార్యక్రమంలో పాల్గొనకపోవడంతో వారిని బుజ్జగించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా ఐఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకులు, ముషీరాబాద్ నియోజకవర్గ సీనియర్ నాయకులు నల్లవెల్లి అంజిరెడ్డి నివాసానికి వెళ్లి ఆయనతో ప్రత్యేకంగా సంప్రదింపులు జరిపారు. అలాగే నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కృపారావు కుమారుడు జాన్ కెనడీని కూడా కలిసి కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడిని ఆపాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ సాగిస్తున్న ఏకపక్ష దాడిని ఆపాలని తెలంగాణ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి టి.సాగర్ అన్నారు. భారత ప్రభుత్వం పాలస్తీనాకు అండగా నిలవాలని కోరారు. బుధవారం సుందరయ్య పార్కు వద్ద ప్రజా సంఘాల పిలుపు మేరకు తెలంగాణ రైతు సంఘం, సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం, ఐద్వా, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, గిరిజన సంఘం ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ... అక్టోబర్ 7వ తేదీ నుంచి పాలస్తీనా భూభాగం మీద, అక్కడి ప్రజల మీద ఇజ్రాయిల్ తీవ్రమైన దాడులు చేస్తూ నరమేధం కొనసాగిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్కడ చూసిన శవాల గుట్టలు, పసిపిల్లల ఆక్రందనలతో గాజా ప్రాంతమంతా రోధనగా మిగిలిపోయిందన్నారు. పాలస్తీనా భూభాగాన్ని ఆక్రమించుకునే క్రమంలో పాలస్తీనాకు ఉనికి లేకుండా చేస్తున్నారని విమర్శించారు. అలాంటి దుర్మార్గమైన చర్యలను రాబోయే కాలంలో చేయాలని కోరారు. 8500 మందికి పైగా మహిళలు, పసిపిల్లలు, వృద్ధులపై దాడులు జరిగితే చనిపోయారని అన్నారు. ఇజ్రాయిల్ అంతర్జాతీయ యుద్ధ న్యాయసూత్రాలను పాటించకపోవడం బాధాకరమన్నారు. అమెరికా దేశం నిసిగ్గుగా ఇజ్రాయిల్‌కు మద్దతు తెలపడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జాతీయ కోశాధికారి ఎం.సాయిబాబు, ఐద్వా ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, ఏఐటియూసీ కార్యదర్శి బాలరాజ్, వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకటరాములు, ఎం.కె.బోస్, పాలడుగు భాస్కర్, వంగూరి రాములు, ఈశ్వర్‌రావు, మూడు శోభన్, అరుణజ్యోతి, ఎస్ఎఫ్ఐ నాయకులు అశోక్, నాగరాజు, కోట రమేష్, జావేద్, ఆశాలత తదితరులు పాల్గొన్నారు.